'ప్రజావాణి'కి 95 ఫిర్యాదులు

వినతులను స్వీకరిస్తున్న కలెక్టర్, అదనపు కలెక్టర్లు

కంఠేశ్వర్, నవంబర్ 25 : జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 95 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్‌తోపాటు అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, డీఆర్డీవో సాయాగౌడ్, ఇన్‌చార్జి డీపీవో శ్రీనివాస్‌కు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు అధికారులకు సూచించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కాన్వకేషన్ సర్టిఫికెట్ ఇవ్వాలి

డిచ్‌పల్లి, నవంబర్ 25 : తెలంగాణ యూనివర్సిటీ ప్రారంభించిన నాటి నుంచి ఇప్పటివరకు పీహెచ్‌డీ పూర్తి చేసిన వారందరికీ కాన్వకేషన్ సర్టిఫికెట్ అందజేయాలని డాక్టరేట్ అసోసియేషన్ సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వీసీ యాదగిరి రావును సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. స్నాతకోత్సవం నోటిఫికేషన్‌లో 2013 నుంచి 2023 వరకు పీహెచ్‌డీ పూర్తయిన వారికి మాత్రమే కాన్వకేషన్ ఇస్తామని పేర్కొనడం తగదన్నారు. 2024 వరకు పీహెచ్‌డీ పూర్తయిన వారందరికీ సర్టిఫికెట్లు అందజేయాలని వీసీ ని కోరారు. డాక్టరేట్ అసోసియేషన్ ప్రతినిధులు సరిత, పీబీ సత్యం, రమేశ్, సతీశ్ తదితరులున్నారు.

ఉద్యోగ పరీక్ష తేదీల్లో మార్పు

వినాయక్‌నగర్, నవంబర్ 25: జిల్లా ప్రధానన్యాయమూర్తి, జిల్లాన్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఆదేశాల మేరకు డిసెంబర్ 15, 16వ తేదీల్లో నిర్వహించాల్సిన గ్రూప్-2 (రికార్డు అసిసెంట్, టైపిస్ట్ కమ్ అసిస్టెంట్) పరీక్షను వాయిదా వేసినట్లు జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. టైపిస్ట్‌కమ్ అసిస్టెంట్ రాత పరీక్ష డిసెంబర్ 14న ఉదయం 9 నుంచి 9.40 గంటల వరకు, టైపు పరీక్ష డిసెంబర్ 17న ఉదయం 9 నుంచి 9.05 గంటల వరకు ఉంటుందని పేర్కొన్నారు. రికార్డు అసిస్టెంట్ రాత పరీక్ష డిసెంబర్ 14న ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఉంటుందని తెలిపారు. అభ్యర్థులు ఈ మార్పును గమనించాలని సూచించారు.

బ్యాంకు వద్ద ఖాతాదారుల ఆందోళన

కోటగిరి(పోతంగల్), నవంబర్ 25 : మండల కేంద్రంలోని ఓ బ్యాంకులో ఖాతాదారులు సోమవారం ఆందోళన చేపట్టారు. తమ ఖాతాల నుంచి కొన్నిరోజులుగా డబ్బులు మాయమవుతున్నాయంటూ బ్యాంకు అధికారులను నిలదీశారు. సీఎస్‌పీ సెంటర్‌లో నుంచి డబ్బులు డ్రా అయినట్లు బ్యాంకు అధికారులు గుర్తించారు. సీఎస్‌పీ నిర్వాహకుడితోపాటు అతడి తల్లిదండ్రులను పిలిపించి మాట్లాడారు. డబ్బులు తీసింది వాస్తవమేనని నిర్వాహకుడు ఒప్పుకున్నాడు. డబ్బులు తిరిగి ఇవ్వడానికి తమకు కొద్ది రోజులు గడువు కావాలని నిర్వాహకుడి తల్లిదండ్రులు కోరగా.. ఖాతాదారులు శాంతించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

వినాయక్‌నగర్, నవంబర్ 25: మద్యానికి బానిసగా మారి,యాసిడ్ తాగిన ఒకరు చికిత్స పొందుతూ మృతిచెందినట్లు త్రీ టౌన్ ఎస్సై మహేశ్ సోమవారం తెలిపారు. నాందేవ్‌వాడకు చెందిన మంత్రి రూపేశ్(37) మద్యానికి బానిసగా మారడంతో అతడి భార్య కొంతకాలం క్రితం వదిలేసి వెళ్లిపోయింది. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన రూపేశ్ ఆదివారం యాసిడ్ తాగగా.. గమనించిన తల్లి వెంటనే దవాఖానకు తరలించింది. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుని తల్లి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

మహిళలను గౌరవించాలి

- ఎక్కడైతే మహిళలు గౌరవించబడతారో అక్కడ దేవతలను పూజించినట్టే..
- సీనియర్ సివిల్ జడ్జి పద్మావతి

మహిళ రక్షణ చట్టాల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి పద్మావతి తదితరులు

వినాయక్‌నగర్, నవంబర్ 25: కుటుంబంలోని మహిళల మధ్య సఖ్యత, సమన్వయం ఉన్నప్పుడు ఎలాంటి సమస్యలు తలెత్తవని,ఎక్కడైతే మహిళలు గౌరవించబడతారో అక్కడ దేవతలను పూజించినట్టేనని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి పద్మావతి అన్నారు. జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయ సేవ అధికార సంస్థ కార్యాయంలో సోమవారం అంతర్జాతీయ స్త్రీ హింస వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు.
స్నేహ సొసైటీ ఫర్ రూరల్ రీ కన్‌స్ట్రక్షన్స్ నిర్వహిస్తున్న సఖీ వన్ స్టాప్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి సీనియర్ సివిల్ జడ్జి పద్మావతి, ట్రైనీ కలెక్టర్ సంకేత్ కుమార్, అదనపు డీసీపీ బస్వారెడ్డి, జిల్లా సంక్షేమ అధికారిణి రసూల్ బీ, రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు సూదం లక్ష్మి ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. ప్రస్తుత కాలంలో మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నప్పటికీ ఇంకా వారిపై దాడులు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళల రక్షణ కోసం ఎన్ని చట్టాలు తీసుకొచ్చినా ఇంట్లో పెద్దలు వారికి మంచి చెడు చెప్పకపోతే నైతిక విలువలు కోల్పోయి మహిళలపై దాడులకు పాల్పడుతారని అన్నారు. కొన్ని వేల గృహహింస కేసులు, వరకట్న వేధింపుల కేసులు నమోదు కావడం బాధాకరమని పేర్కొన్నారు. అనంతరం చిన్నారులు,మహిళల నాటక ప్రదర్శనలు అబ్బురపరిచాయి. వివిధ రంగాల్లో సేవలు అందిస్తున్న మహిళలను ఘనంగా సన్మానించారు. మహిళ రక్షణ చట్టాల కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ రోహిణి, న్యాయవాది వసంత కుమారి, టీచర్ ఎన్.విమల, లక్ష్మీదేవి, శ్రీవాణి, స్నేహ సొసైటీ కార్యదర్శి ఎన్.సిద్ధయ్య, ప్రిన్సిపాల్ జ్యోతి, సఖి అడ్మినిస్ట్రేషన్ భానుప్రియ, కౌన్సిలర్లు, సఖి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ దవాఖానల్లో దోపిడీపై ఉద్యమం

పోస్టర్లను ఆవిష్కరిస్తున్న పీవైఎల్, పీవోడబ్ల్యూ నాయకులు

ఖలీల్‌వాడి, నవంబర్ 25 : రాష్ట్రంలో ప్రైవేట్, కార్పొరేట్ దవాఖానల్లో దోపిడీ తారాస్థాయికి చేరిందని, ఈ దోపిడీని ప్రభుత్వం అరికట్టాలని పీవైఎల్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అనీష్, నవీన్ కుమార్, పీవోడబ్ల్యూ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి గోదావరి, సంధ్యా రాణి డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు ఇందుకుసంబంధించిన ప్రచార పోస్టర్లను జిల్లా కమిటీల ఆధ్వర్యంలో నగరంలోని ఎన్ఆర్ భవన్‌లో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ప్రభుత్వ దవాఖానల్లో మెరుగైన వైద్యం అందకపోవడంతో ప్రజలు తప్పని పరిస్థితుల్లో ప్రైవేట్ దవాఖానలను ఆశ్రయిస్తున్నారని తెలిపారు. దీనిని ఆసరాగా చేసుకున్న కార్పొరేట్ హాస్పిటల్స్ ఇష్టారాజ్యంగా ఫీజుల దోపిడీకి పాల్పడుతున్నాయని ఆరోపించారు. టెస్ట్‌లు, మందుల పేరుతో లక్షల రూపాయల బిల్లులు వేస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వ దవాఖానలను బలోపేతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పీవోడబ్ల్యూ జిల్లా ఉపాధ్యక్షురాలు సత్తెక్క, సహాయ కార్యదర్శి రమా, పీవైఎల్ జిల్లా ఉపాధ్యక్షులు సాయిబాబా, జిల్లా నాయకులు దండు మహేశ్, రాజేశ్వర్, రాజు, మహిళా నాయకులు నర్సక్క, పద్మ, పుష్పలత, అమూల్య, లలిత పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహం ధ్వంసం చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలి

ఖలీల్‌వాడి, నవంబర్ 25: అంబేద్కర్ విగ్రహం ధ్వంసం చేసిన దుండగులను శిక్షించాలని బీమ్ ఆర్మీ జిల్లా కార్యదర్శి బత్తుల కిష్టయ్య డిమాండ్ చేశారు. జగిత్యాల జిల్లాలో అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేయడాన్ని నిరసిస్తూ జిల్లా కేంద్రంలోని ధర్నాచౌక్‌లో సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా భీమ్ ఆర్మీ జిల్లా కార్యదర్శి బత్తుల కిష్టయ్య, జిల్లా అధ్యక్షుడు అజయ్ మాట్లాడారు. అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా కన్వీనర్ సీహెచ్.వెంకటరమణ, పట్టణ అధ్యక్షుడు విజయ సాలంకే, సక్కి ప్రభాకర్, సాయినాథ్, అనిల్, మారుతి, దీపక్, సచిన్, ధనుష్ పాల్గొన్నారు.

ఆలయ ప్రహరీ నిర్మాణానికి భూమిపూజ

ఆర్మూర్‌టౌన్, నవంబర్25: పట్టణంలోని నల్ల పోచమ్మ ఆలయ ప్రహరీ నిర్మాణానికి సర్వ సమాజ్ అధ్యక్షుడు ఆకుల రాజు సోమవారం భూమిపూజ చేశారు. ఆయన మాట్లాడుతూ ఆలయానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా ప్రహరీ నిర్మిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్వసమాజ్ సభ్యులు పాల్గొన్నారు.

యువతిని వేధించిన పోకిరీ ఇంటిపై దాడి

వినాయక్‌నగర్, నవంబర్ 25: జిల్లా కేంద్రంలో ఓ యువతిని వేధింపులకు గురి చేసిన పోకిరీ ఇంటి పై పలువురు దాడి చేసి, ఇంట్లోని వస్తువులు ధ్వంసం చేశారు. ఈ ఘటన ఆదివారం రాత్రి చోటు చేసుకున్నది. ప్రభుత్వ దవాఖానలో నర్సుగా పని చేస్తున్న ఓ యువతిని స్థానిక హసాద్ బాబా నగర్ ప్రాంతానికి చెందిన ఓ యువకుడు వేధించసాగాడు. సదరు యువతి ఆ విషయాన్ని తన పరిచయస్తులకు చెప్పింది. వారు యువకుడిని చితకబాదడానికి అతడికి ఇంటికి వెళ్లారు. ఆ సమయంలో అక్కడ యువకుడు లేకపోవడంతో ఆయన ఇంట్లోని వస్తువుల ధ్వంసం చేశారు. ఈ ఘటన పై బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

నిరసన ప్రదర్శనను జయప్రదం చేయాలి

మాట్లాడుతున్న టీయూసీఐ రాష్ట్ర అధ్యక్షుడు వనమాల కృష్ణ

ఖలీల్‌వాడి, నవంబర్ 25: కార్మిక, రైతు సంఘాల ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలో నేడు నిర్వహించనున్న నిరసన ప్రదర్శనను జయప్రదం చేయాలని ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టీయూసీఐ) రాష్ట్ర అధ్యక్షుడు వనమాల కృష్ణ పిలుపునిచ్చారు. సోమవారం ఆయన నగరంలోని కోటగల్లీలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ కార్మిక, రైతు, ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ జిల్లా కేంద్రంలో కార్మిక రైతు సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించనున్నట్లు తెలిపారు. రాజీవ్‌గాంధీ ఆడిటోరియం వద్ద సభ, ధర్నాచౌరస్తా వరకు భారీ ర్యాలీ ఉంటుందని పేర్కొన్నారు. కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్లను ఎత్తివేయాలని, కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు నరేందర్, సుధాకర్, మల్లేశ్, సాయన్న, రవి, గంగాధర్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి నేషనల్ భారత్ సేవా పురస్కారం

ఆర్మూర్‌టౌన్, నవంబర్25: మండలంలోని కోమన్‌పల్లి ప్రభుత్వ పాఠశాలలో కోకిల నాగరాజు ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. ఆయన నేషనల్ భారత్ సేవా పురస్కారాన్ని అందుకున్నట్లు హెచ్ఎం కవిత సోమవారం తెలిపారు. కోకిల నాగరాజును ఉపాధ్యాయులు సన్మానించారు.

నాణ్యమైన భోజనం అందించాలి

సిరికొండ, నవంబర్ 25: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని తహసీల్దార్ రవీందర్‌రావు అన్నారు. మండలంలోని చీమన్‌పల్లి గ్రామంలో ఉన్న మహాత్మా జ్యోతిరావు పూలే బాలికల గురుకుల పాఠశాలను సోమవారం తనిఖీ చేశారు. హాస్టల్ ఆవరణ పరిశుభ్రంగా ఉంచాలని, వంటసామగ్రి స్టాక్ రిజిస్టర్లను మెయింటేన్ చేయాలని సూచించారు. బాలికలకు అన్ని సౌకర్యాలు అందేలా చూడాలన్నారు. సమస్యలను తెలుసుకుని నివేదికను కలెక్టర్‌కు అందిస్తామని తెలిపారు. కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను ఎంఈవో రాములు తనిఖీ చేశారు. ఆర్ఐ గంగరాజు, ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి, పర్వీన్ ఉన్నారు.

అథ్లెటిక్స్ పోటీల్లో 'విజయ్' విద్యార్థుల ప్రతిభ

ఖలీల్‌వాడి, నవంబర్ 25: నగర శివారులోని రాజారాం స్టేడియంలో నిర్వహించిన అథ్లెటిక్స్ పోటీల్లో ఓవరాల్ చాంపియన్ షిప్ విజేతలుగా విజయ్ విద్యాసంస్థల విద్యార్థులు నిలిచారని పాఠశాల కరస్పాండెంట్ ప్రభాదేవి తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రంలోని విజయ్ పాఠశాలలో విద్యార్థులను ఘనంగా సన్మానించారు. అండర్ -8 విభాగంలో కారుణ్య- రజతం, ప్రజ్వక్ సాయి- కాంస్య, సూర్యతేజ -బంగారు పతకం, అండర్ -10 విభాగంలో హర్దిక్ కాంస్యం, సూరజ్ బంగారు పతకం సాధించారని పేర్కొన్నారు.

నేడు పాలిటెక్నిక్ కళాశాలలో అవగాహన సదస్సు

ఖలీల్‌వాడి, నవంబర్ 25 : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జాతీయ రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ఫీల్డ్ ఆఫీస్ నిజామాబాద్ ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు సీబీసీ ఫీల్డ్ ఆఫీసర్ ధర్మానాయక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వ్యాసరచన, ఉపన్యాస, పాటల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు.

జిల్లా వాసి వరలక్ష్మికి సాహిత్యంలో అవార్డు

ఖలీల్‌వాడి, నవంబర్ 25 : కరీంనగర్ జిల్లాలోని ఫిలీం భవన్‌లో శ్రీ ఆర్యన్ సకలకళా వేదిక, శ్రీ గౌతమేశ్వర సాహితీ సంస్థల ఆధ్వర్యంలో విభిన్న రంగాల్లో విశిష్ట సేవలందించిన ప్రముఖులకు జాతీయస్థాయి చతుర్ముఖ సింహా అవార్డులను సోమవారం అందజేశారు. నిజామాబాద్ జిల్లా డొంకేశ్వర్ మండలం తొండాకూర్ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం సీహెచ్.వరలక్ష్మికి జాతీయస్థాయి చతుర్ముఖ సింహ అవార్డును ప్రదానం చేశారు. వరలక్ష్మి 500లకు పైగా కవితలు, 280కి పైగా చిత్రాలు, 20 పాటలు, 30 కథలు రాసి, సాహిత్యంలో రాణిస్తున్నందున అవార్డుకు ఎంపిక చేశారు.

ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యుడిగా శివ

డిచ్‌పల్లి, నవంబర్ 25 : ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యుడిగా తెలంగాణ యూనివర్సిటీ విద్యార్థి నాయకుడు బి.శివ రెండోసారి ఎన్నికయ్యారు. ఉత్తరప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్‌లో ఈనెల 22 నుంచి 24 వరకు నిర్వహించిన 70వ జాతీయ మహాసభల్లో శివ జాతీయ కార్యవర్గ సభ్యుడిగా ఎన్నికయ్యారు. విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం పని చేస్తానని శివ పేర్కొన్నారు.

రోడ్డు విస్తరణ పనులకు రూ.8 కోట్లు మంజూరు

ధర్పల్లి, నవంబర్ 25 : మండల కేంద్రంలోని తెలంగాణ తల్లి విగ్రహం నుంచి ఎన్టీఆర్ కాలనీ మీదుగా దమ్మన్నపేట్, బెల్యాతండా వరకు రోడ్డు విస్తరణ పనులకు రూ. 8కోట్లు మంజూరైనట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆర్మూర్ చిన్నబాల్‌రాజ్ తెలిపారు. సోమవారం పీఆర్ ఏఈ బాలాజీతో కలిసి తెలంగాణ తల్లి విగ్రహం వద్ద రోడ్డును పరిశీలించారు. త్వరలోనే రోడ్డు పనులు ప్రారంభిస్తారని తెలిపారు. నాయకులు శ్రీనివాస్, సురేందర్‌గౌడ్ ఉన్నారు.

గ్యాస్ వినియోగంలో మెళకువలు పాటించాలి

పోతంగల్, నవంబర్ 25: గ్యాస్ వినియోగంలో మెళకువలు పాటించాలని బోధన్ దీక్షిత్ హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు దీక్షిత్ అన్నారు. కోటగిరి మండల కేంద్రంలోని శ్రీ వేద హైస్కూల్లో గ్యాస్ వినియోగం -జాగ్రత్తలపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. గ్యాస్ ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను విద్యార్థులకు వివరించారు. గ్యాస్ మెళకువలపై అవగాహన కల్పించి, ప్రోత్సాహకాలను అందించారు.

'రైతులు చెరుకు పండించాలి'

బోధన్, నవంబర్ 25: నిజాం షుగర్స్ ఫ్యాక్టరీ పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటున్నామని, రైతులు చెరుకు పంటపై దృష్టిని సారించాలని బోధన్ ఎమ్మెల్యే పి.సుదర్శన్‌రెడ్డి అన్నారు. సోమవారం సాలూర మండల కేంద్రంలోని రైతు వేదికలో వ్యవసాయం, ఉద్యానవనం శాఖల ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రుద్రూర్ వ్యవసాయ శాస్త్రవేత్తలు అధిక దిగుబడిని ఇచ్చే కొత్త చెరుకు వంగడాలను చూపిస్తున్నారని, వాటిని సాగుచేస్తే అధిక దిగుబడి లభిస్తుందన్నారు.సమావేశంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, జిల్లా గ్రంథాలయ అభివృద్ధి సంస్థ చైర్మన్ రాజిరెడ్డి, రుద్రూర్ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త డాక్టర్ బాలాజీ, జిల్లా ఉద్యానవనశాఖ అధికారి బి.శ్రీనివాస్, జిల్లా వ్యవసాయ అధికారి వాజిద్ హుస్సేన్, ఏఎంసీ మాజీ చైర్మన్ బి.గంగాశంకర్, బోధన్ ఏడీఈ సంతోష్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

బసవేశ్వర విగ్రహావిష్కరణ

మాట్లాడుతున్న బోధన్ ఎమ్మెల్యే పి.సుదర్శన్‌రెడ్డి

బోధన్ రూరల్, నవంబర్ 25: సాలూర మండలంలోని ఖాజాపూర్ గ్రామంలో బసవేశ్వర విగ్రహాన్ని సోమవారం ఆవిష్కరించారు. బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై విగ్రహాన్ని ప్రారంభించారు. అంతకు ముందు బసవేశ్వరుడికి వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బెటి ముంగ్రా సిద్దదయాల్ శివాచార్య స్వామిజీ, మల్లారం బాలయోగి పిట్ల కృష్ణమహరాజ్, సుంకిని సిద్దేశ్వర స్వామి, మావందికుర్దు మల్లికార్జున స్వామీజీ, నాయకులు పాల్గొన్నారు. బోధన్ మండలంలోని బర్దిపూర్, రాజీవ్‌నగర్ తండా గ్రామాల్లో జీపీ భవన నిర్మాణానికి బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి భూమిపూజ చేశారు.

ప్రభుత్వ హాస్టళ్లలో వైద్య బృందం తనిఖీలు

బోధన్‌లోని ఒక ప్రభుత్వ హాస్టల్ కిచెన్‌లో తనిఖీలు చేస్తున్న వైద్య బృందం

బోధన్, నవంబర్ 25: బోధన్ పట్టణంలోని ప్రభుత్వ వసతిగృహాల్లో ఆహారం నాణ్యతతో పాటు బియ్యం, పప్పులు, వంట సరుకుల నాణ్యతను పరిశీలించేందుకు ప్రత్యేక వైద్య బృందం సోమవారం తనిఖీ చేసింది. రాష్ట్రంలోని పలు హాస్టళ్లు, గురుకులాల్లో ఇటీవల విషాహారం తిని పలువురు విద్యార్థులు అస్వస్థతకు గురవుతున్న నేపథ్యంలో హాస్టళ్లలో ఆహార నాణ్యతను పరిశీలించేందుకు ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ వైద్య బృందం తనిఖీలు నిర్వహించింది. ఆహారం తయారుచేస్తున్న విధానంతోపాటు పాడైన వంట సరుకులు ఏవైనా వాడుతున్నారా అన్న విషయాలపై ఈ బృందం ఆరాతీసింది. ఈ బృందంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో సమత, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ వినీత్, వైద్య సిబంది ఉన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని, పరిసరాల పరిశుభ్రతను పాటించాలని వారు సూచించారు.

బోధన్‌లో గురుకులాల హాస్టళ్ల తనిఖీ

బోధన్‌లోని మైనార్టీ బాలుర, పాండుఫారంలోని మైనార్టీ బాలికల గురుకుల పాఠశాలల హాస్టళ్లను బోధన్ ఎంఈవో నాగయ్య తనిఖీచేశారు. ఆహారం నాణ్యత, వంట సరుకులను పరిశీలించారు. పాండుఫారంలోని బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థులతో కలిసి ఆయన భోజనం చేసి సంతృప్తిని వ్యక్తంచేశారు.

ఏర్గట్లలోని కేజీబీవీ..

ఏర్గట , నవంబర్ 25: ఏర్గట్ల మండల కేంద్రంలోని కేజీబీవీని మండల వైద్యాధికారిణి రక్షిత తనిఖీ చేశారు. మరుగుదొడ్లు, వంట గది, స్టోర్ రూమ్, పరిసరాలను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ.. బాలికలు ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆమెవెంట పాఠశాల ఎస్వో సుంకారి సంధ్యా, ఏఎన్ ఎంలు, వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు ఉన్నారు.

పరిశుభ్రత పాటించాలి

బాల్కొండ, నవంబర్ 25: వంట గదిలో పరిశుభ్రత పాటించాలని కిసాన్‌నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ స్రవంతి అన్నారు. మండల కేంద్రంలోని కేజీబీవీతో పాటు వివిధ పాఠశాలలను ఆమె తనిఖీ చేశారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి మురళి, పర్యవేక్షకులు మెరామ్మ, మధమతి, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

రెంజల్‌లో..

రెంజల్, నవంబర్ 25: స్థానిక ఎస్సీ బాలుర వసతి గృహాన్ని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి, మండల ప్రత్యేకాధికారి వాజిద్ హుస్సేన్ తనిఖీ చేశారు. వారి వెంట వార్డెన్ శ్రీకాంత్ ఉన్నారు.

చందూర్‌లో..

చందూర్, నవంబర్, 25: చందూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ బీసీ హాస్టల్, మైనారిటీ గురుకుల కళాశాల హాస్టళ్లను వైద్యాధికారులు తనిఖీ చేశారు. హాస్టళ్లలో నిత్యావసర సరుకులు, పరిసరాలను పరిశీలించారు.

పార్టీలకతీతంగా అభివృద్ధి

శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి

నందిపేట్, నవంబర్ 25: ఆర్మూర్ నియోజకవర్గాన్ని పార్టీలకతీతంగా అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి అన్నారు. డొంకేశ్వర్ మండలం డొంకేశ్వర్ - నూత్‌పల్లి రోడ్డు నిర్మాణానికి సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. రూ.కోటి 32 లక్షల వ్యయంతో డొంకేశ్వర్, నూత్‌పల్లి, లొంక రామాలయం మీదుగా తారు రోడ్డును వేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆనంద్‌కుమార్, ఎంపీడీవో శ్రీనివాస్‌రావు, బీజేపీ డొంకేశ్వర్ మండల అధ్యక్షుడు సురేందర్, నాయకులు సంతోష్‌రెడ్డి, మారంపల్లి గంగాధర్, వీడీసీ సభ్యులు పాల్గొన్నారు.

పింఛన్లు పెంచాలని ధర్నా

వినతిపత్రం అందజేస్తున్న దివ్యాంగులు

బోధన్, నవంబర్ 25: సమస్యలను పరిష్కరించాలని డిమాండ్‌చేస్తూ పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట సోమవారం వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పీఆర్‌డీ) ఆధ్వర్యంలో దివ్యాంగులు ధర్నా చేశారు. దివ్యాంగులకు రూ.6000 పింఛన్ హామీని వెంటనే అమలుచేయాలని, వృద్ధులు, వితంతువులకు రూ.4000 పింఛన్ ఇవ్వాలని డిమాండ్‌చేశారు. ధర్నా అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయంలో డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. ధర్నాకు ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర సహాయ కార్యదర్శి గంగాధర్, జిల్లా అధ్యక్షుడు గైని రాములు నాయకత్వం వహించారు.

అసెంబ్లీని ముట్టడిస్తాం

రెంజల్, నవంబర్ 25: కాంగ్రెస్ ప్రార్థి ఎన్నికల హామీలను అమలు చేయాలని లేని పక్షంలో కలెక్టరేట్, అసెంబ్లీని ముట్టస్తామని ఏఐపీకేఎంఎస్ నాయకులు హెచ్చరించారు. రెంజల్ మండలం బోర్గాం గ్రామంలో మ్యానిఫెస్టో కర పత్రాలతో ఇంటింటా తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. ఏఐపీకేఎంఎస్ రాష్ట్ర నాయకులు పార్వతి రాజేశ్వర్, నసిర్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

- **నిత్యాన్నదానం ప్రారంభం-** ఆర్మూర్‌టౌన్,నవంబర్25: పట్టణంలోని జంబి హనుమాన్ ఆలయ ఆవరణలో సోమవారం నుంచి నిత్యాన్నదానం 41 రోజుల పాటు కొనసాగుతుందని అయ్యప్ప ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అయ్యప్ప స్వాములు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.
- **7 నుంచి సీఎం కప్- 2025 క్రీడా పోటీలు-** బాల్కొండ, నవంబర్ 25: మండల కేంద్రంలో సీఎం కప్ 2025 క్రీడా సన్నాహాక సమావేశం సోమవారం నిర్వహించారు. డిసెంబర్ 7, 8 తేదీల్లో గ్రామస్థాయిలో, 10 నుంచి 12 వరకు మండల స్థాయిలో సీఎం కప్ క్రీడా పోటీలు నిర్వహించన